# రేవంత్‌కో హఠావో..

## రగులుతున్న హస్తం

- గాంధీభవన్‌లో రెండో రోజు నిరసనలు
- పత్తాలేని నేతలు.. ప్రధాన భవనానికి తాళం
- గెలువని స్థానాలు బీసీలకా..!
- మండిపడుతున్న బీసీ నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హస్తం రగులుతూనే ఉంది. మొదటి జాబితాపై రెండో రోజూ కూడా నిరసనలు కొనసాగాయి. గ్రేటర్ పరిధిలోని పాతబస్తీ నియోజకవర్గాలతో పాటు మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించి టికెట్ల కేటాయింపుపై అసంతృప్తులు సోమవారం కూడా గాంధీభవన్ వద్ద నిరసనలు తెలిపారు. దీంతో పార్టీ కీలక నేతలెవరూ కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. రెండు రోజులుగా బోసిపోతున్న గాంధీభవన్ ప్రధాన భవనానికి తాళం వేశారు. మరోవైపు కాంగ్రెస్ అసంతృప్తుల నిరసనలు గాంధీభవన్ దాటి గన్‌పార్కును సైతం తాకాయి. ఈ నేపథ్యంలో ప్రశ్నిస్తున్న నేతల్ని సస్పెండ్ చేస్తుండటంతో వ్యవహారం మరింత ముదురుతుంది.

### పెరుగుతున్న అసమ్మతి సెగలు..

కాంగ్రెస్ పార్టీ రెండు రోజుల కిందట మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో గ్రేటర్ పరిధిలో 24 నియోజకవర్గాల్లో పద్నాలుగు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించారు. వీటిలో ఆరు పాత బస్తీకి చెందిన స్థానాలు ఉన్నాయి. అయితే జాబితా విడుదలైన వెంటనే పలు నియోజకవర్గాల్లో వెల్లువెత్తిన అసమ్మతి సెగలు రెండో రోజు కూడా కొనసాగాయి. సోమవారం గాంధీభవన్ ముందు పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురకు చెందిన నేతలు బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారికి కాకుండా ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇస్తున్నారంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రేవంత్‌కో హఠావో.. అనే నినాదం మార్మోగింది. దీంతో పాటు మేడ్చల్ నియోజకవర్గ టికెట్ కేటాయింపుపైనా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గంలోకి వచ్చిన అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ (జంగయ్య యాదవ్)ను అడ్డుకున్న హరివర్ధన్‌రెడ్డి వర్గం గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. హరివర్ధన్‌రెడ్డి వర్గం గాంధీ భవన్‌కు వచ్చారు. మహిళా నేతలు కూడా వచ్చి ప్లకార్డులతో నిరసన తెలిపారు. టికెట్లు అమ్ముకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే గాంధీభవన్ ప్రధాన భవనానికి తాళం వేయగా... వెనుక వైపు ఉన్న భవనంలోకి రాకుండా అక్కడ ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో పార్టీ కోసం కష్టపడిన తమను అడ్డుకుంటున్నారని, ఇదెక్కడి న్యాయం అంటూ మహిళా నేతలు సిబ్బందిని ప్రశ్నించారు.

## పాతబస్తీలో హస్తం ఆటలు

కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపులో బీసీ నేతలకు జరుగుతున్న అన్యాయంపై నిత్యం ఎవరో ఒక నేత గళం వినిపిస్తూనే ఉన్నారు. ప్రతి పార్లమెంటు పరిధిలో రెండు నియోజకవర్గాల్లో బీసీలకు టికెట్లు కేటాయిస్తామన్న ఉదయపూర్ తీర్మానాన్ని కాలరాస్తున్నారని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మజ్లిస్ కంచుకోటలైన పాతబస్తీకి చెందిన పలు నియోజకవర్గాల్లో బీసీ నేతలకు టికెట్లు కేటాయించి, వారిని బీసీ జాబితాలో చూపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాతబస్తీలో మొత్తం ఉన్న ఏడుకు ఏడు స్థానాలు గాలిపటమే ఎగురేసుకుపోతుందని చంటి పిల్లాడిని అడిగిన టక్కున చెబుతాడు. కార్వాన్ మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాలు గాలిపటాన్నే ఎగురవేస్తాయి. అయితే చెల్లని నియోజకవర్గాలను బీసీలకు కేటాయిస్తారా అని పలు బీసీ సంఘాలు, కాంగ్రెస్ బీసీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే తనకు టికెట్ ఇవ్వడం లేదని ముందుగానే తెలుసుకున్న పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. కాగా ఇదే అంశంపై టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. తన నివాసంలో పలువురు నేతలతో భేటీ అయిన ఆయన బీసీ నేతలతో పాటు తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన వారికి పార్టీ అధిష్టానం అన్యాయం చేస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ టికెట్ ఆశిస్తున్న ఆయనకు రేవంత్ చెక్ పెడుతూ... ముద్దగోని రామ్మోహన్‌గౌడ్‌ను రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. దీంతో లోలోపల రగిలిపోతున్న మధుయాష్కీ బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మరింత స్వరం పెంచే అవకాశాలున్నట్లు పార్టీ నేతలే చెబుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడిస్తాం

- కాంగ్రెస్ పార్టీ పీసీసీ మాజీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి రాజీనామా


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జితేందర్‌రెడ్డి, తదితరులు

ఉప్పల్, అక్టోబర్ 16: ఉప్పల్ కాంగ్రెస్‌పార్టీలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనలు, దిష్టిబొమ్మ దహనాలు నిర్వహిస్తున్నారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌పార్టీ పీసీసీ మాజీ సెక్రటరీ పుడూరి జితేందర్ రెడ్డితో సహ 200 మంది కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్‌లో సోమవారం రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉప్పల్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిపై అక్రమాలు, కేసులను వివరిస్తామన్నారు. కాంగ్రెస్‌పార్టీకి ఎన్నో ఏండ్లుగా సేవలు అందిస్తున్నా సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్‌గాంధీని ముద్దపప్పు అని విమర్శించిన వ్యక్తిని పార్టీలోకి తీసుకువచ్చి పీసీసీ అధ్యక్షుడిని చేశారన్నారు. పార్టీ కోసం కష్టపడినవారిని కాకుండా తనకు జిందాబాద్‌లు కొట్టేవారికే, బౌన్సర్లుగా పనిచేసే నేతలకే పార్టీలో గుర్తింపు, పదవులు కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. హోల్‌సేల్‌గా పార్టీని కొని, రిటైల్‌గా విక్రయిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పార్టీని ప్రవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల పార్టీ టెకెట్లను అంగడి సరుకుగా మార్చేశారని తెలిపారు. వేలంపాటగా మార్చి, డబ్బులకు టికెట్లు ఇస్తున్నారని ఆరోపించారు. టీడీపీని ముంచేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీని నాశనం చేసే పనిలో పడ్డారని తెలిపారు. సొంతపార్టీ నాయకుల మీదనే దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టి వేధించే కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని కచ్చితంగా ఓడిస్తామన్నారు. అనంతరం ఉప్పల్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.


కూకట్‌పల్లి డివిజన్‌లో అభివాదం చేస్తున్న విప్ గాంధీ

## మీ ఆశీర్వాదం కోసం గడపగడపకు వస్తున్నా..

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ , అక్టోబరు 16 : రాష్ట్రంలోనే అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడిగా రెండు దఫాలుగా ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించటం అదృష్టమని, అందుకు వేల కోట్ల నిధులను వెచ్చించి విస్తృతమైన అభివృద్ధి పనులను చేపట్టి వారి రుణం తీర్చుకుంటున్నట్లు విప్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సంపూర్ణ అండదండలతో శాసనసభలో విజయవంతంగా మూడోసారి అడుగుపెట్టి ప్రజా ఆకాంక్షలను మరింతగా నెరవేరుస్తానని గాంధీ అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా విప్ గాంధీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదాలతో పాటు బీఫామ్‌ను సైతం అందుకున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార పర్వాన్ని ప్రారంభించారు.


యూసుఫ్‌గూడలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి..

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పాదయాత్ర

జూబ్లీహిల్స్,అక్టోబర్16: ఎన్నికలలో ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్ పార్టీకి మాత్రమే ఉందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం యూసుఫ్‌గూడ డివిజన్ హైలం కాలనీ, వెంకటగిరిలలో పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తూ ఓటర్లను కలిసి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వెయ్యాలని కోరారు. అభివృద్ధే ఎజెండాగా ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డామని.. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందేలా చూశామన్నారు. ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేలా అద్భుతమైన మ్యానిఫెస్టోతో బంగారు తెలంగాణకు బాటలు వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరును.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించే కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ ముందుకు సాగారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జేబీఎస్ మీదుగా విజయవాడకు ఆర్టీసీ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు జూబ్లీబస్‌స్టేషన్ (జేబీఎస్) మీదుగా విజయవాడకు బస్సులను నడపాలని టీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది. బీహెచ్‌ఈఎల్, మియాపూర్ నుంచి బయల్దేరే 24 సర్వీసులను ఎంజీబీఎస్ నుంచి కాకుండా జేబీఎస్ మీదుగా నడపనుంది. ఆ సర్వీసులు కేపీహెచ్‌బీ కాలనీ, బాలానగర్, బోయిన్‌పల్లి, జేబీఎస్, సంగీత్ (పుష్పక్ పాయింట్), తార్నాక (పుష్పక్ పాయింట్), హబ్సిగూడ (పుష్పక్ పాయింట్), ఉప్పల్ (పుష్పక్ పాయింట్), ఎల్బీనగర్ మీదుగా విజయవాడకు నడుస్తాయి. అక్టోబర్ 18 నుంచే ఈ 24 సర్వీసులు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తాయి. జేబీఎస్ మీదుగా వెళ్లే ఈ బస్సుల టికెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఎంజీబీఎస్ నుంచి నడిచే సర్వీసుల మాదిరిగానే చార్జీలుంటాయి. ఈ సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం tsrtconline.inను సంప్రదించాలని యాజమాన్యం ప్రకటించింది. ప్రస్తుతం బీహెచ్‌ఈఎల్ – మియాపూర్ నుంచి వచ్చే బస్సులు ఎంజీబీఎస్ మీదుగా విజయవాడకు వెళ్తున్నాయి. దీంతో జేబీఎస్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల ప్రయాణికులు ఎంజీబీఎస్‌కు రావాల్సి వచ్చేది. ఈ విషయాన్ని కొందరు ప్రయాణికులు టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. జేబీఎస్ మీదుగా విజయవాడకు బస్సులను నడపాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తుల మేరకు మొదటగా 24 సర్వీసులను జేబీఎస్ మీదుగా విజయవాడకు నడపాలని సంస్థ నిర్ణయించింది. బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, జేబీఎస్, తార్నాక, హబ్సిగుడ, ఉప్పల్ ప్రాంతాల ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరమైన ఈ బస్సులను వినియోగించుకోవాలని టీఎస్‌ఆర్టీసీ కోరుతోంది.

## రైళ్ల భద్రతపై దృష్టి పెట్టండి

సిటీబ్యూరో, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): దసరా పండుగ నేపథ్యంలో పెరుగుతున్న అధిక ప్రయాణికుల సంఖ్య నేపథ్యంలో రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం ట్రాకులపై రైళ్ల తాకడి బాగా పెరుగుతుందని రైల్వే అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో రైళ్ల రాకపోకలు సజావుగా సాగటానికి వీలుగా ఎప్పటికప్పుడు ట్రాకులు తనిఖీలు చేయాలని అధికారులను జోనల్ రైల్వే జీఎం ఆదేశించారు. ఈ మేరకు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో విజయవాడ, గుంటూరు, గుంతకల్, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్లతో పాటు రైల్వే నిలయంలో ఉన్న పలు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే దసరా, దీపావళి వరుస పండగల నేపథ్యంలో ప్రయాణికుల తాకిడి బాగా పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రైల్వే స్టేషన్లలో మౌలిక వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ విషయంలో రైల్వే సిబ్బంది మొత్తం పూర్తి స్థాయిలో పని చేయాలన్నారు. రైళ్లలో కూడా ప్రయాణికుల సౌకర్యాలకు ఎలాంటి లోటు రాకుండా అన్న రకాల చర్యలు తీసుకోవాలని నిత్యం అధికారులు ఆదేశించారు. రిజర్వేషన్ రైళ్లతో పాటు అన్ రిజర్వ్‌డ్ రైళ్లలో కూడా ప్రయాణికుల సౌకర్యాలు మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఎంలను ఆదేశిస్తున్నారు.